ధర్మాగ్రహం

పోలీసులను ఉసిగొల్పుతున్నారు



మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం, పత్రికా ఎడిటర్లపై దాడి హేయమైన చర్య. ఇది ఒక్క సాక్షిపైనే కాదు పత్రికా రంగంపైనే దాడి. పోలీసులను ఉసిగొల్పుతున్నారు. జర్నలిస్టు సంఘాలు చూస్తూ ఊరుకోవు.

– కొంక్యాణ వేణుగోపాల్, రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఉపాధ్యక్షులు

పథకం ప్రకారమే..



కూటమి ప్రభుత్వం వచ్చాక వారి తప్పులను ఎత్తిచూపే మీడియా వాళ్లను పోలీసులు అక్రమ అరెస్టులు చేస్తున్నారు. 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి ఆఫీసులోకే నేరుగా వెళ్లి భయభ్రాంతులకు గురిచేయడం తగదు. ఈ దాడులను జిల్లా లోని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

– శాసపు జోగినాయుడు, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అక్షరం శాశ్వతం.. ప్రభుత్వాలు కాదు



'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిని పోలీసులు వేధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రభుత్వాలు కాదు.. అక్షరం శాశ్వతమన్నది పోలీసులు గుర్తెరగాలి.

– డాక్టర్ కంఠ వేణు, దళిత, ప్రజా సంఘాల హక్కుల పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు, శ్రీకాకుళం

తప్పుడు కేసులను ఎత్తివేయాలి..



'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలు తక్షణమే నిలిపివేయాలి. ఐదురోజుల వ్యవధిలో ఒకే కేసుకు నాలుగైదు నోటీసులు జారీ చేయడం ప్రజాస్వామ్య చరిత్రలో ఎప్పుడూ లేదు.

– తైక్వాండో శ్రీను, అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్

ప్రభుత్వాలను మార్చే శక్తి అక్షరానిదే..



పత్రికా స్వేచ్ఛపై కూటమి ప్రభుత్వం దాడులు హేయం. సాక్షి ఎడిటర్‌పై, ఇతర జర్నలిస్టులపై అక్రమ అరెస్టులు బనాయించి మానసికంగా కృంగిపోయేలా చేస్తున్నారు. ప్రభుత్వాలనే మార్చే శక్తి అక్షరానికి ఉన్నదని గుర్తెరగాలి.

– నాగరాజు, బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి

బంగాళాఖాతంలో కలవడం ఖాయం..



జర్నలిస్టులను ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని చంద్రబాబు, పవన్‌లు ప్రగల్భాలు పలికారు. ఇప్పుడేమో పోలీసులతో ఇలాంటి చర్యలకు పూనుకుంటున్నారు. ప్రశ్నించేవారిపై దాడిచేసే ఈ కూటమి ప్రభుత్వం బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయం.

– రవికుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు

పత్రికా స్వేచ్ఛకు ఆటంకమే



'సాక్షి' ఎడిటర్ ధనంజయ రెడ్డితో పాటు విలేకరులను వేధింపులకు గురి చేయడ శోచనీయం. ప్రజాస్వామ్యంలో నాల్గో స్తంభంలా ఉన్న పత్రికా రంగంపై ఇలా దాడులు చేయడం పద్ధతి కాదు.

– ధర్మాన కృష్ణచైతన్య, జెడ్పీటీసీ

జర్నలిస్టు హక్కులు కాపాడాలి



జర్నలిస్టులు వారు చూస్తున్న, జరుగుతున్న అన్యాయాలను పత్రికా ముఖంగా వెలుగులోకి తెస్తారు. దీన్ని తప్పుగా భావించి కేసులు పెట్టడం సరికాదు. ఇది హక్కులను కాలరాయడమే. – ఆర్.సురేష్‌బాబు, సీఐటీయూ



శ్రీకాకుళంలో ఏడు రోడ్ల కూడలిలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పత్రికలపైనే పగ సాధింపులా..?

అక్షరానికి అండగా ప్రజా సంఘాలు గళమెత్తాయి. సత్యానికి తోడుగా పాత్రికేయ వర్గాలు అడుగు కదిపాయి. 'సాక్షి' మీడియాపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కక్ష సాధింపు చర్యలను నిరసిస్తూ జిల్లాలో జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డిపైన, నెల్లూరు రిపోర్టర్లపైన తరుచూ విచారణలు, ఆధారాలు ఇవ్వాలంటూ వేధించడాన్ని ప్రజా సంఘాలతో కలిపి జర్నలిస్టులు దుయ్యబట్టారు. 'సాక్షి'పై బనాయించిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు, మీడియా సంస్థలపై ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు ఏకమై పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అయితే జర్నలిస్టుల నిరసన ప్రదర్శనకు కూడా ఆంక్షలు తప్పవని పోలీసు వర్గాలు సూచించాయి. పరిమిత సంఖ్యలో నిరసన చేయాలని కోరడం గమనార్హం.

– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

- 'సాక్షి'పై అక్రమ కేసుల బనాయింపు, ఎడిటర్‌ను వేధించడంపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- ప్రభుత్వం తీరుపై ధ్వజమెత్తిన జర్నలిస్టులు, ప్రజా సంఘాలు
- కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్

శ్రీకాకుళం క్రైమ్, శ్రీకాకుళం : 'సాక్షి'పై సర్కారు వేధింపులకు నిరసనగా జిల్లాకేంద్రంలోని ఏడురోడ్ల కూడలిలో జర్నలిస్టు, ప్రజాసంఘాలు నిరసన తెలిపాయి. అనంతరం శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానందను కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు కొంక్యాణ వేణుగోపాల్, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాసపు జోగినాయుడు, సాక్షి బ్యూరో చీఫ్ కందుల శివశంకర్, సాక్షి టీవీ బ్యూరో సునీల్, దళిత, ప్రజా సంఘాల హక్కుల పరిరక్షణ ఐక్య వేదిక నాయకులు డాక్టర్ కంఠ వేణు, అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను, బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికుమార్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

రణస్థలంలో..

రణస్థలం: 'సాక్షి'పై కక్ష సాధింపు ఆపాలని డిమాండ్ చేస్తూ రణస్థలం, జి. సిగడాం మండల తహసీల్దార్లు సనపల కిరణ్ కుమార్, ఎం.సరితలకు ఎచ్చెర్ల నియోజకవర్గంలోని జర్నలిస్టులు వినతి పత్రాలు అందజేశారు.

పాతపట్నంలో..

పాతపట్నం: పత్రికా ఎడిటర్లపై, జర్నలిస్టులపై బెదిరింపు ధోరణి సరికాదని పాతపట్నం జర్నలిస్టులు బి.షణ్ముఖరావు(గోవింద్), ఈ.గోపాల్, జి.శ్రీనివాసరావు, బి.సుధాకర్, ఆర్.రాజేష్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు పాతపట్నం విలేకరుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఎస్.ప్రసాద రావుకు వినతిపత్రం అందజేశారు.



రణస్థలంలో తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రెస్‌క్లబ్ సభ్యులు శుక్రవారం 'సాక్షి'కి మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, సీఐ మీసాల చిన్నంనాయుడుకి వినతి పత్రాలను అందజేశారు.

పలాసలో..

పలాస: 'సాక్షి'పై ప్రభుత్వ వ్యవహారశైలికి నిరసనగా ఏపీయూడబ్ల్యూజే, వివిధ ప్రజా సంఘాల ఆధ్వ ర్యంలో పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి.. ఆర్డీఓ జి.వెంకటేష్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సీహెచ్ జగదీష్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు డి.మహారణ, పలాస కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ నేతాజి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో..

టెక్కలి: టెక్కలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట టెక్కలి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి పై నెల్లూరు పోలీసులు చేసిన అక్రమ విచారణ మంచిది కాదన్నారు. అనంతరం ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెండి నరసింగరావుతో పాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. వీరికి సీఐటీయూ నాయకులు ఎన్.షణ్ముఖరావు, బి.వాసుదేవ రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హెచ్.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు టి.కిరణ్ తదితరులు మద్దతు తెలిపారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: జర్నలిస్టులు, ప్రజాసంఘాల ప్రతినిధులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ టి.సత్యనారాయణకు వినతి పత్రం ఇచ్చారు. సాక్షిపై కక్ష సాధింపులకు పాల్పడడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ బైరాగినాయుడు, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు మోహన చంద్రదేవ్, కనపల శేఖరరావు, నర్సింగరావు, దండి జయప్రకాశ్, ధర్మాన జగన్, బొబ్బాది ఈశ్వరరావులతో పాటు ఏపీయూడబ్ల్యూజే నరసన్నపేట శాఖ ప్రతినిధులు తాతాజీ, ఉమా, కిరణ్, గనేష్, కాశీ, కేశవ, మురళి తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు, ప్రజాసంఘాల ప్రతినిధులు



ఇచ్ఛాపురం: తహసీల్దార్ వెంకటరావుకి వినతి పత్రం అందజేస్తున్న ఇచ్ఛాపురం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బంది



టెక్కలి: టెక్కలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాలు



పలాస: ఆర్డీఓ జి.వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పలాస కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ సభ్యులు, ప్రజాసంఘాల ప్రతినిధులు



పాతపట్నం: తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

రాజకీయ ఒత్తిళ్లకు పోలీసులు బలికావద్దు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

పలాస: రాజకీయ ఒత్తిళ్లకు పోలీసులు బలి కావద్దని, శాంతిని కోరుకునే జిల్లాలో హింసను ప్రోత్సహించవద్దని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాసు కోరారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కల్తీ మద్యం నిరసనకు సంబంధించి జరుగుతున్న వ్యవహారంపై ఆరాతీశారు. పోలీసులు వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొడుతున్నారని, ఇది సరికాదన్నారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలో గుణపాఠం చెబుతారని అన్నారు. అప్పలరాజును పరామర్శించిన వారిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాసు

రూ.1కే బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్

శ్రీకాకుళం అర్బన్: దీపావళి సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సంస్థ వినియోగదారులకు శుభవార్తను అందించింది. కేవలం రూ.1కే 30రోజుల కాలపరిమితి, అపరిమిత కాలింగ్, రోజుకి 2 జీబీ డేటా, రోజుకు 100 మెసేజ్‌లు, ఉచిత సిమ్‌కార్డు ఇస్తామని ఆ సంస్థ జనరల్ మేనేజర్ నాయుడు మఠ్రి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎన్‌పీ వినియోగదారులకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సిమ్ కార్డు కావాల్సిన వారు దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని, లేదా రిటైలర్స్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం అర్బన్: కార్తీక మాసం సందర్భంగా ప్రసిద్ధ శైవ క్షేత్రాలైన పంచారామాలను దర్శించుకునేందుకు వీలుగా ఆర్టీసీ సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను ప్రయాణికులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో కార్తీకమాసంలో శైవ క్షేత్రాలకు నడుపు ప్రత్యేక బస్సులకు సంబంధించిన కరపత్రాలను శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో పంచారామాలను దర్శించుకునేందుకు వీలుగా ఈ నెల 26వ తేదీన, అక్టోబరు 2వ తేదీన, అక్టోబరు 9వ తేదీన అక్టోబరు 16వ తేదీల్లో జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పంచారామాలకు బయల్దేరుతాయని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఒక్కొక్కరికి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సునకు రూ.2,400గాను, అల్ట్రా డీలక్స్ బస్సునకు రూ.2,350గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, భక్తులందరూ ఉపయోగించుకోవాలని కోరారు.



పంచారామాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

టపాసుల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



శ్రీకాకుళం పాతబస్టాండ్: దీపావళి టపాసుల విక్రయాలు జరిపేందుకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలసి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల వద్ద అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

11 అర్జీల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్వాభిమాన్ దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్‌తో పాటు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వినతులు స్వీకరించారు. 11 శుక్రవారాల్లో 169 అర్జీలు వచ్చాయన్నారు. ప్రతి నెలా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రై సైకిల్స్, బ్యాటరీ ట్రై సైకిల్స్ మరమ్మతులకు గురైతే వాటి మరమ్మతులకు జిల్లా పరిషత్‌లో ఒక రూం కేటాయించి అక్కడే మరమ్మతులు చేపడతారని చెప్పారు. ఈ వారం స్వాభిమాన్‌కు 11 అర్జీలు అందాయి. అర్జీల స్వీకరణలో జెడ్పీ సీఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యూకే స్కాలర్‌షిప్‌కు అనూష ఎంపిక


పోలాకి అనూష

పాతపట్నం: బూరగాం గ్రామానికి చెందిన పోలాకి అనూష యునైటెడ్ కింగ్‌డమ్‌లోని చెస్టర్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ హెల్త్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్‌లో చదివేందుకు వైస్ చాన్సలర్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. దీనిలో భాగంగా మొదటి ఏడాది 6,500 పౌండ్లు (రూ.7,67 లక్షలు), రెండో ఏడాదికి ప్లేస్‌మెంట్ పొందింది. ఐఈఎల్‌టీఎస్ పరీక్షలో మంచి స్కోర్ సాధించింది. అనూష తండ్రి పోలాకి గణపతి రైతు, తల్లి పోలాకి వరలక్ష్మి గృహిణి. అనూష జెమ్స్‌లో బీఎస్సీ నర్సింగ్, నాగార్జున యూనివర్సిటీలో డిప్లమా ఇన్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ చదివింది.

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు


వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస: ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా అర్జీలు పరిష్కారానికి పోలీసు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి చెప్పారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ప్రజాగ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కాశీబుగ్గ, టెక్కలి సబ్ డివిజన్ పరిధిలోని ప్రజల కోసం ప్రత్యేకంగా ఈ గ్రీవెన్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. పౌర సంబంధాలు, కుటుంబ, ఆస్తి గొడవలు, మోసపూరితమైనవి ఇతరత్రా అంశాలపై పలు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించామని తెలిపారు.

300 గ్రాముల వెండి చోరీ


పరిశీలిస్తున్న క్లూస్ టీం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని చినబొందిలీపురం సమీపంలో బాయన్నతోటలో నివాసముంటున్న రిటైర్డ్ డైట్ లెక్చరర్ ఇంట్లో 300 గ్రాముల వెండి చోరీకి గురైంది. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం .. ఈ నెల 8న సంపతి పురుషోత్తం తన పెద్ద బావమరిది ఇంట్లో జరిగే శుభకార్యానికి భార్యతో కలిసి విశాఖపట్నం వెళ్లారు. కుమార్తె, కుమారులు పుణేలో జాబ్ చేస్తున్నారు. శుక్రవారం ఉదయం వీరి నివాసగృహం మేడ మీద అద్దెకుంటున్న వ్యక్తి కిందకొచ్చి చూడగా తలుపుల తాళాలు పగలగొట్టడాన్ని గమనించి పురుషోత్తంకు ఫోన్‌లో సమాచారమందించారు. ఇంటికి చేరిన పురుషోత్తం బీరువా అరలో వెండి పోవడాన్ని గమనించాడు. లోపలి లాకర్లలో బంగారు వస్తువులు, నగదు భద్రంగానే ఉన్నాయి. కాగా ఈ చోరీ గురువారం అర్ధరాత్రి 1:30 నుంచి 4:20 గంటల మధ్య జరిగినట్లు సమీప సీసీ ఫుటేజీలో దృశ్యాలు కనిపించాయని స్థానికులు అనుకుంటున్నారు. పక్కనే మరో రెండు గృహాల్లోనూ చోరీకి యత్నించి విఫలమైనట్లు తెలుస్తోంది. సీఐ ఈశ్వరరావు, హెచ్‌సీ శివాజీ, క్లూస్‌టీమ్ ఘటనా స్థలికి చేరి పరిసరాలను పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరపాలక సంస్థలో విజిలెన్స్ తనిఖీలు


క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతున్న విజిలెన్స్ అధికారులు

శ్రీకాకుళం : శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు రెండు రోజుల పాటు తనిఖీలు చేపట్టారు. గుంటూరు నుంచి వచ్చిన ప్రత్యేక బృందం గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పలు ఫైళ్లను తనిఖీ చేసిన అధికారులు, శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా చేపట్టిన వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి రికార్డులు, కొనుగోలు చేసిన సామగ్రి బిల్లులను పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి తనిఖీలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే శ్రీకాకుళం నగరపాలక సంస్థలో కూడా తనిఖీలు జరుగుతున్నాయని నగరపాలక సంస్థ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ పనుల్లో కొన్ని అవకతవకలు జరిగాయని, రాష్ట్రస్థాయికి ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో దీనికి సంబంధించి కూడా పరిశీలన చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కొనుగోలు జరిగినప్పుడు పని చేసిన ఇంజినీరింగ్ అధికారులను, గుమస్తాలను రప్పించి వారి నుంచి వివరాలు సేకరించినట్లు సమాచారం. వివరాలు వెల్లడించేందుకు అధికారులు నిరాకరించారు.

స్కాన్ చేస్తే.. స్క్రీన్‌పై పాఠాలు!

- దీక్షా యాప్‌లో ఎన్‌సీఈఆర్‌టీ, స్టేట్ సిలబస్‌లు
- ప్రతి పుస్తకంపైనా క్యూఆర్ కోడ్
- సులువుగా అర్థమయ్యేలా రూపకల్పన



క్యూఆర్ కోడ్‌తో ఉన్న పాఠ్య పుస్తకాలు

నరసన్నపేట : అనారోగ్యంతో పాఠశాలకు వెళ్లకున్నా.. ఒకవేళ వెళ్లినా పాఠాలు సరిగ్గా అర్థం కాకున్నా విద్యార్థులు చదువులో వెనుకబడిపోతున్నారు. అలాంటి విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం దీక్ష యాప్ అందుబాటులోనికి తెచ్చింది. అందులో ఎన్‌సీఈఆర్‌టీతో పాటు స్టేట్ సిలబస్ పుస్తకాలను కూడా పొందుపరిచారు. విద్యార్థులు సులువుగా పాఠ్యాంశాలను మొబైల్ ఫోన్ స్క్రీన్ ద్వారా చదువుకునేలా రూపకల్పన చేశారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే..

జిల్లాలో 2955 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 264804 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సరఫరా చేసిన అన్ని పాఠ్య పుస్తకాలపైనా క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. పాఠ్యాంశంపై విద్యార్థులు పూర్తి పట్టు సాధించేందుకు నిపుణుల ద్వారా దీక్షా యాప్‌ను పొందుపరిచారు. యాప్‌ను సెల్‌ఫోనులో డౌన్ లోడ్ చేసుకొని పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అర్థంకాని పాఠ్యాంశాన్ని సులువుగా అవగాహన అయ్యేలా రూపొందించారు. ఆడియో, వీడియో, క్విజ్, అసైన్మెంట్ వంటి సౌకర్యాలు కల్పించారు. ముఖ్యంగా ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆడియో పాఠాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

సెల్‌ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి దీక్షా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.అందులోకి వెళ్లి వివరాలు నమోదు చేయాలి. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే వెంటనే పాఠ్యాంశం తెరపై కనిపిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యంపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నాం. వివిధ కారణాల వల్ల పాఠశాలలకు రాని వారు ఈ యాప్ ద్వారా పుస్తకాలపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పాఠ్యాంశాలు సులభంగా చదువుకోవచ్చు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– బి.ధనుంజయ్, ఎస్‌జీటీ, రాళ్లపాడు ఎంపీపీ స్కూల్, పోలాకి మండలం

ప్రయోజనకరం..



విద్యార్థుల సౌలభ్యం కోసం దీక్షా యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలపై కూడా క్యూఆర్ కోడ్ ముద్రించారు. యాప్ ద్వారా పాఠ్యాంశాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే విద్యార్థులు సులువుగా పాఠాలు చదవవచ్చు.

– యు.శాంతారావు, ఎంఈఓ, నరసన్నపేట

దాతలే దిక్కు..!

- అరసవల్లిలో దయనీయ స్థితిలో పేద కుటుంబం
- మంచానికే పరిమితమైన తండ్రి
- ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న కుమారుడు
- వైద్యఖర్చులకు సాయం కోసం ఎదురుచూపులు


నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైన రమేష్. పక్కనే ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న కుమారుడు లీలాసాయికృష్ణ

అరసవల్లి: ఆరేళ్ల క్రితం జరిగిన బస్సు ప్రమాదం ఆ ఇంటి యజమాని కాళ్లను చచ్చుబడేలా చేసి మంచానికే పరిమితం చేసింది. అలాంటి స్థితిలో ఉన్న భర్త, పిల్లల బాగోగులు చూసుకుంటూ కుట్టుమిషనే ఆధారంగా జీవనం కొనసాగిస్తున్న ఆ ఇల్లాలికి విధి మరో సమస్యను తెచ్చిపెట్టింది. దీంతో దాతల సాయం కోసం ఆమె ఎదురుచూస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. అరసవల్లి ఆదిత్య నగర్ కాలనీలో పేద కుటుంబానికి చెందిన కళ్లేపల్లి రమేష్, సుజాత దంపతులు. రమేష్ ఓ ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేసేవారు. ఆరేళ్ల క్రితం ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడటంతో రెండు కాళ్లకు ఆపరేషన్ చేశారు. సుమారు రూ.15 లక్షల వరకు వైద్యానికి ఖర్చు అయినప్పటికీ నడవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. ఇక ఇంటర్ చదువుతున్న కుమారుడు లీలా సాయికృష్ణకు ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ స్థాయి అధికమవ్వడంతో రక్తవాంతులతో బాధపడుతున్నాడు. ఈ కుర్రాడికి బ్రాన్కోసిస్ సమస్య ఉండటంతో బ్రాన్కోస్కోప్ పరీక్షలు చేయించాల్సి ఉంది. ఈ పరీక్షలకు విశాఖపట్నం ఆసుపత్రిలో సుమారు రూ.లక్ష వరకు అవుతుందని.. అంతటి ఆర్థిక స్థోమత తమకు లేదని వాపోతున్నారు. భార్య కళ్లేపల్లి సుజాత ఎంతో కష్టపడి లేడీస్ టైలరింగ్ నేర్పిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఇంతటి దీన పరిస్థితిలో ఉన్న తమను దాతలెవరైనా ఆదుకుని (ఫోన్‌పే నంబర్ 9381442744) కాపాడాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

పింఛన్ ఇప్పించరూ...!

రమేష్‌కు సదరం సర్టిఫికెట్ ద్వారా 66 శాతం అంగవైకల్యం ఉన్నట్లు వైద్యులు ధృవీకరించినప్పటికీ.. ప్రభుత్వం మాత్రం ఇంతవరకు పింఛన్ మంజూరు చేయలేదు. రెండు కాళ్లకు ఆపరేషన్ జరిగి మంచానికే పరిమితమైనప్పటికీ సర్కార్ పెద్దలు దృష్టి సారించడం లేదు. నెలనెలా పింఛన్ వస్తేకుటుంబానికి కొంత భరోసా దక్కుతుందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పింఛన్ మంజూరు చేయాలని రమేష్ కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


కొత్తపుట్టుగలో పార్టీలో చేరినవారితో వైఎస్సార్ సీపీ నాయకులు

కవిటి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేయడం మరెవ్వరికీ సాధ్యం కావని కొత్తగా పార్టీలో చేరిన పలువురు కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం కవిటి మండలం కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావు నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో టీడీపీ నుంచి పలువురు కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

శావసానపుట్టుగకు చెందిన వీరికి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణ, తమకున్న నమ్మకానికి భరోసా పెరిగి వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కార్యదర్శులు సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, నర్తు నరేంద్రయాదవ్, పిలక రాజలక్ష్మి, ఉలాల భారతీదివ్య, కడియాల ప్రకాష్, ఇప్పిలి కృష్ణారావు, పూడి నేతాజీ, నర్తు ప్రేమ్‌కుమార్, నర్తు శివాజీ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ట్యాంకర్ షిప్‌లో పనిచేసేందుకు వెళ్తూ..


మైలపిల్లి తారకేశ్వరరావు (ఫైల్)

గార: ట్యాంకర్‌షిప్‌లో విధుల్లో చేరేందుకు వెళ్తూ బోటు బోల్తా పడిన ఘటనలో గార మండలం కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన మైలపిల్లి తారకేశ్వరరావు గల్లంతయ్యాడు. ఈ మేరకు షిప్పింగ్ సంస్థ కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చింది. స్కార్పియో షిప్పింగ్ సంస్థ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సంస్థలో ట్యాంకర్‌షిప్‌లో బూసన్ (సూపర్‌వైజర్)గా పనిచేస్తున్న తారకేశ్వరరావు ఈ నెల 12న స్వగ్రామం నుంచి బయలుదేరాడు. గురువారం మొజాంబికా సముద్రతీరంలో ఉన్న ట్యాంకర్ షిప్‌లో డ్యూటీ ఎక్కేందుకు గానూ 12 మంది బృందంతో కలసి లాంచ్ బోటులో ప్రయాణం చేస్తుండగా బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదుగురు సురక్షితంగా కాగా, ఇద్దరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. గల్లంతైన ఐదుగురిలో తారకేశ్వరరావు ఒకరు. దీంతో భార్య లక్ష్మీకాంతమ్మ, ఇద్దరు కుమారులు, కుటుంబ సభ్యుల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

తప్పులతడకగా రీ సర్వే

- నరసన్నపేటలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు


తహసీల్దార్ కార్యాలయంలో బైఠాయించిన రైతులు

నరసన్నపేట: భూ సమస్యలను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేను కూటమి ప్రభుత్వం సక్రమంగా నిర్వహించడం లేదని, ఇప్పుడు కూడా భూములపై తమకు హక్కులు కల్పించరా.. అంటూ చెన్నాపురం, నడగాంకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి లోపల బైఠాయించారు. ఎన్నో ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న రీ సర్వేలో కూడా హక్కులు కల్పించకపోతే ఎలా అని అధికారులను నిలదీశారు. వెబ్ ల్యాండ్ ప్రకారం, అడంగల్ ప్రకారమే మళ్లీ పేర్లు వస్తున్నాయని, ఒకరి పొలం మరొకరి పేరున వస్తుందని.. అసలు పొలమే లేని వారిపేరున ఎకరాలు చూపుతున్నారని ఆందోళన చెందారు. భూములు అమ్ముకున్న వారి పేరిటే మళ్లీ భూమి హక్కులు కనిపిస్తున్నాయని, ఇష్టానుసారంగా రైతుల పేర్లు మార్చేశారని రైతులు కె.రమణమూర్తి, గొనపు బాబూరావు, సనపల సూరిబాబు, దుప్పట్ల రాజశేఖర్, ధర్మారావు, రమణ, బాబ్జీ, కొంక్యాన నర్సింహమూర్తి, చిట్టిబాబు తదితరులు వాపోయారు. రికార్డులు సక్రమంగా తీర్చిదిద్దాలని, మళ్లీ రీ సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, నిబంధనల మేరకే రీ సర్వేలో భూహక్కులు కల్పిస్తున్నామని, మీరు అనుకున్న విధంగా హక్కులు కల్పించమంటే తమవల్ల కాదని తహసీల్దార్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావులు చెప్పడంతో రైతులు వాగ్వాదానికి దిగారు. గ్రామానికి వస్తామని, తప్పులుంటే నిబంధనల మేరకు సరిచేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు.

చెరువులో ఆక్రమణలు కూల్చివేత


అధికారుల సమక్షంలో జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

పొందూరు: లోలుగు గ్రామంలో చెరువు గర్భంలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లోలుగు గ్రామంలోని 111 సర్వే నంబర్‌లో 5.44 ఎకరాల్లో కూర్మగుండం చెరువు ఉంది. అందులో సుమారు 25 సెంట్లలో 17 మంది షెడ్ల నిర్మాణంతో పాటు కొంత భాగం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. చెరువు గర్భం ఆక్రమణపై కొందరు గ్రామస్తులు పొందూరు తహసీల్దార్ కార్యాలయంతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆరు నెలలు క్రితం పొందూరు రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు సర్వే నిర్వహించారు. ఇందులో 17 మంది 25 సెంట్ల స్థలం ఆక్రమించినట్లు గుర్తించారు. ఆక్రమణలు తొలగించాలని రెండు నెలల క్రితం పొందూరు తహసీల్దార్ ఆర్.వెంకటేష్ నోటీసులు జారీ చేశారు. దీనిపై స్పందన లేకపోవడంతో శుక్రవారం పోలీసుల సమక్షంలో ఆక్రమణలను తొలగించారు. ఈ సమయంలో బాధితులు మాట్లాడుతూ తాము ఈ స్థలాలను 15 ఏళ్ల క్రితం కొనుగోలు చేశామని, వాటిని ఎలా తొలగిస్తారంటూ అధికారులను నిలదీశారు. సంబంధిత స్థలాన్ని కొనుగోలు చేసి షెడ్డును నిర్మించుకుని పిండిమిల్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని అధికారులకు పిసిని శ్యామలరావు తెలిపారు. ఇదే షెడ్డును తొలగించాలని తమకు ఇబ్బంది పెడుతూ, దౌర్జన్యం చేస్తున్నారని, కలెక్టర్ గ్రీవెన్సులో సైతం ఫిర్యాదు చేశానని చెప్పారు. తొలగింపుల్లో వివక్షత చూపుతున్నారంటూ బాధితులు వాదించారు. చెరువు గర్భాలలో చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, వాటిని తొలగించారా అని నిలదీశారు. ఈ సమయంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తమ విధులకు అడ్డుపడితే చర్యలు తప్పవని తహశీల్దార్ వెంకటేష్, సీఐ సత్యనారాయణలు ఆక్రమణదారులను హెచ్చరించారు. ఎస్సై వి.సత్యనారాయణ, జి.బాలరాజు, సర్వేయర్ గణపతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మత్స్యకార సామగ్రి దగ్ధం


కొవ్వాడలో కాలిపోయిన షెడ్

రణస్థలం: కొవ్వాడ గ్రామంలో బడె మహందాతకు చెందిన కమ్మల షెడ్ శుక్రవారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతైంది. తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్, బాధితుడు మహందాతకు తెలిపిన వివరాల ప్రకారం.. కొవ్వాడ తీరంలోని సముద్రం ఒడ్డున తాటి, కొబ్బరి కమ్మలతో షెడ్ ఉంది. అందులో మత్స్యకారులకు చెందిన 12 పెద్ద వలలు, మర బోటు, ఇంజన్ బోటు, తాళ్లు ఉన్నాయి. ఈ షెడ్‌కు విద్యుత్ సరఫరా లేదు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు గ్రామస్తులు చూసేసరికి కమ్మల షెడ్ కాలిపోయి కనిపించింది. గుర్తు తెలియని వ్యక్తులు షెడ్ కాల్చి వేసి ఉంటారని బాధితుడు అనుమానిస్తున్నాడు. సుమారు రూ.25 లక్షలు వరకు నష్టం చేకూరిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. ఘటనా స్థలాన్ని ఎఫ్‌డీవో గంగాధర్, జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి పరిశీలించారు.

వసతిగృహాల పనులు వేగవంతం చేయాలి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో అత్యవసరంగా చేయాల్సిన పనులు వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, కార్పొరేషన్ ద్వారా జరుగుతున్న పనుల ప్రగతిపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని తొమ్మిది గురుకులాలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దుప్పలవలస (మైదానం పాత నిర్మాణాలు, రోడ్లు), శ్రీకాకుళం పెదపాడు (దోమతెరలు, డ్రైనేజీ, లీకేజీలు), ఆమదాలవలస (కొల్లివలస డార్మిటరీ, ప్రహరీ, శానిటేషన్, విద్యుత్), తామరపల్లి (ఆధునీకరణ, నీటి సరఫరా) హాస్టళ్లలో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి అవసరమైన నిధులపై చర్చించారు. కొల్లివలసలో మోడ్రన్ కిచెన్ కోసం రూ.15 లక్షలు, పలాసలో మరమ్మతులకు రూ.10 లక్షలు అవసరమని అధికారులు తెలియజేశారు. నందిగాం హాస్టల్‌లో రూ.1.79 కోట్లతో జరుగుతున్న డైనింగ్ కం కిచెన్ హాల్, తరగతి గదుల నిర్మాణాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని గడువు విధించారు. మరుగుదొడ్ల నిర్మాణం కోసం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుంచి నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని హాస్టల్స్‌లో పారిశుద్ధ్యం, మంచినీటి సౌకర్యం సరిగా లేదని ఫిర్యాదులు రావడంతో, ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో జాప్యం, నాణ్యతలో రాజీ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఈ బి.రామకృష్ణ, డీఈఈ బి.శ్రీరాములు, జిల్లా కో ఆర్డినేటర్ వై.యశోద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొర్ని కుర్రాడి 'పవర్'

- పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్నరాజశేఖరరావు
- జాతీయ స్థాయి పోటీల్లో పతకాల కైవసం


జంషెడ్‌పూర్‌లో జరిగిన పోటీల్లో విజేతగా చమల్ల రాజశేఖరరావు


బెంగళూరులో స్వర్ణపతకం అందుకుంటూ..

గార : సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన కుర్రాడు జాతీయ స్థాయిలో 'పవర్' చూపిస్తున్నాడు. ఓవైపు ఉద్యోగ సాధనలో నిమగ్నమవుతూనే.. మరోవైపు ఎక్కడ పోటీలు జరిగినా పతకం రావాల్సిందే అన్నట్లుగా ప్రతిభ కనబరుస్తున్నాడు. గార మండలం కొర్ని గ్రామానికి చెందిన చమల్ల రాజశేఖరరావు జిల్లాలో విద్యాభ్యాసం పూర్తి చేసి ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాలలో భాగంగా రాజమండ్రిలో కోచింగ్ తీసుకుంటున్నాడు. ఓవైపు చదువుతూనే, మరోవైపు వ్యాయామం పట్ల ఆసక్తి ఉండటంతో అక్కడే భారతీయ వ్యాయామ కళాశాలకు వెళ్లి రెండు పూటలా వ్యాయామం చేసేవాడు. అక్కడ వివిధ రకాలైన కోచ్‌ల పరిచయంతో క్రీడాపోటీలకు కూడా శిక్షణ తీసుకున్నాడు. ప్రభుత్వ ఉద్యోగాలకు స్పోర్ట్స్ కోటా కూడా ఉండటంతో ఆసక్తి మరింతగా పెరిగింది. రెండు సంవత్సరాలుగా పలు పోటీల్లో పాల్గొన్న రాజశేఖర్ జాతీయ స్థాయి పోటీల్లో మెరిసాడు. ఇటీవల బెంగళూరులో జరిగిన నేషనల్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2015 పోటీల్లో ఫుల్‌పవర్ లిఫ్టింగ్, పుష్ పుల్, బెంచ్‌ప్రెస్ మూడు విభాగాల్లో స్వర్ణ పతాకాలు సాధించాడు. గతంలోనూ జంషెడ్‌పూర్‌లో ఇండియన్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాడు. తూర్పు గోదావరి జిల్లా స్థాయి పోటీలు, రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో మూడు సార్లు పాల్గొని ప్రథమ స్థానం సాధించాడు.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం..

చంద్రశేఖర్ పదో తరగతి వరకు కొర్ని హైస్కూల్, ఇంటర్మీడియెట్ గురజాడ, డిగ్రీ ఆదిత్య కళాశాలలో చదివాడు. మావయ్యలు మళ్ల యేగీశ్వరరావు, మళ్ల లక్ష్మీనారాయణల ప్రోత్సాహం, అన్నయ్య చమల్ల కృష్ణారావు, సుమలత ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ సూచనలు చంద్రశేఖర్‌కు ఉపయోగపడ్డాయి. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి పోటీల్లో రాణించడంపై గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ పోటీలే లక్ష్యం

అంతర్జాతీయ స్థాయిలో ఫుల్ పవర్‌లిఫ్టింగ్ రాణించడమే లక్ష్యం. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనిది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యమైనా, జాతీయ స్థాయి పోటీలతో పాటు అంతర్జాతీయ పోటీల్లో కూడా రాణించాలన్న కోరిక ఉంది. అసోషియేషన్‌లు సహకారం అందించాలి.

– చమల్ల రాజశేఖరరావు, కొర్ని, గార మండలం

షిర్డీసాయిబాబా మందిరంలో చోరీ


హుండీని పరిశీలిస్తున్న క్లూస్ టీం పోలీసులు

పాతపట్నం: పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలోని షిర్డీగిరిపై షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం షిర్డీసాయి బాబా మందిరం వెనుక పక్క ఉన్న వెంటిలేటర్ రంధ్రం ద్వారా దొంగలు లోపలికి వెళ్లి 500 గ్రాముల వెండి పళ్లెం, పెట్టెలో రూ.23,150 నగదు, హుండీ కానుకలను చోరీ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు భక్తులు వచ్చి చూసేసరికి చోరీ జరిగిందని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం వచ్చి మందిరం, హుండీని పరిశీలించారు. సీసీ కెమెరాల వైర్లు తెంచినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సెమినార్ విజేతలకు ప్రశంసాపత్రాలు


విజేతలకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఈఓ

శ్రీకాకుళం: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో విజేతలకు డీఈఓ రవిబాబు ప్రశంసాపత్రాలను అందజేశారు. క్వాంటం ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్ అండ్ చాలెంజర్స్ అనే అంశంపై జిల్లాస్థాయి సెమినార్ నిర్వహించారు. ఇందులో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మోడల్ స్కూల్ విద్యార్థి పి.అభిషేక్ కుమార్ రెడ్డి, హయాతినగరం ఎంజేపీబీఎస్ పాఠశాల విద్యార్థి పి.హేమలత ద్వితీయ స్థానాన్ని సాధించారు. వీరు ఈ నెల 18న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. వీరిని డీఈఓతో పాటు ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయ్‌కుమారి, సైన్స్ ఆఫీసర్ ఎం.కుమారస్వామి, ప్రధానోపాధ్యాయులు పి.సతీష్‌కుమార్, సూర్యప్రకాష్ తదితరులు అభినందించారు.